సాక్షి తిరుపతి

గురువారం । 27 । మార్చి । 2025



వేలం పాటల్లో స్వామిభక్తి

చంద్రగిరి వారపు సంత వేలం పాటల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వామిభక్తి చాటుకున్నారు. పంచాయతీ రాబడికి గండి కొట్టారు. - 8లో



అన్నమయ్యకు తిరుమంజనం

తిరుమలలో అన్నమయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన వంశీకులు తాళ్లపాక విగ్రహానికి తిరుమంజనం చేశారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
తిరుపతి	6-27	4-52
గూడూరు	6-22	4-49

న్యూస్‌రీల్

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రామమూర్తి

తిరుపతి సిటీ: శాస్త్ర విజ్ఞానంతో ఎన్నో ఆవిష్కరణలతో సమాజ ఉన్నతి కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు డీజీ రామమూర్తి కోరారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగంలో బుధవారం నిర్వహించిన డీ-కాంటినమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఎంచుకున్న రంగంలో క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. ఏ రంగంలో రాణించినా, నైతిక విలువలు మరువకూడదన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని కోరారు. మరో అతిథి డాక్టర్ కుమార్ మాట్లాడుతూ ఎంతో విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవితంలో నిత్య విద్యార్థిగా ఉండాలని సూచించారు. అనంతరం అతిథులను సన్మానించారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు పాల్గొన్నారు.

పది పరీక్షకు 558 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 558 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 164 పరీక్ష కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్, ప్రైవేటు విద్యార్థులు 27,280 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 558 మంది గైర్హాజరవ్వడంతో 26,722మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు డీఈఓ కేవీఎస్ కుమార్ తెలిపారు. అలాగే పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షకు 1,007 మంది హాజరవ్వాల్సి ఉండగా వారిలో 143 మంది గైర్హాజరవ్వడంతో 864 మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు.

జిల్లాకు ఐదుగురు డీటీలు

తిరుపతి అర్బన్: జిల్లాకు ఐదుగురు డిప్యూటీ తహసీల్దార్లను కేటాయిస్తూ బుధవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఐదుగురు రెవెన్యూ ఉద్యోగులను తిరుపతి జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం వీరిలో కే. మాధవి(సీనియర్ అసిస్టెంట్, తిరుపతి కలెక్టరేట్),జి.కృష్ణమ్మ(ఆర్ఐ,ఆర్సీపురం), బి. సుధాకర్‌నాయక్(ఆర్ఐ, రొంపిచర్ల), ఎం.భాస్కర్(ఆర్ఐ, చంద్రగిరి), బి.నాగరాజు (ఆర్ఐ,తొట్టంబేడు) పనిచేస్తున్నారు. డీటీలుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లాకు కేటాయించారు. వీరికి తిరుపతి కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు.



మరోసారి.. బరి తెగింపు

మాకు సభ్యుల బలం లేకున్నా.. అధికార బలం..బలగం ఉంది. అడ్డదారా?..దొడ్డిదారా? ఏదైతేనేం.. స్థానిక సంస్థల పదవులన్నీ మా వశం కావాలి.. అందుకు దేనికైనా బరితెగిద్దాం.. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్ స్థానాలన్నీ కైవసం చేసుకుందాం.. అన్న రీతిలో కూటమి నేతలు మరోసారి బెదిరింపులు, దౌర్జన్యాలు..దాష్టీకాలు చేయాలని కుట్రలు పన్నుతున్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులను తమవైపు తిప్పుకోవడానికి కేసులు పెట్టించి, కుయుక్తులు చేస్తున్నారు.

- నేడు మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్ష, సర్పంచ్ ఉపఎన్నికలు
- బలం లేకున్నా పదవుల కైవసం కోసం..
- రామకుప్పంలో బరితెగింపు
- ముగ్గురు వైఎస్సార్‌సీపీ నేతలను మాయం చేసిన పోలీసులు
- రక్షణ కల్పించమని పోలీసులకిచ్చిన వినతి పత్రం లాగి పడేసిన టీడీపీ నేతలు
- తిరుపతి రూరల్ ఎంపీపీ ఉపఎన్నికపై న్యాయస్థానం మూడో కన్ను
- తవణంపల్లిలో గూడుపుఠాణి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుపతి డిప్యూటీ మేయర్ ఉపఎన్నిక తరహాలో మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్ష, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కూటమి నేతలు బరితెగించాలని కుట్రలకు పదును పెడుతున్నారు. ఈ ఉపఎన్నికల్లో కూడా కిడ్నాప్, దౌర్జన్యం, దాడులు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో నాలుగు ఎంపీపీలు, రెండు ఉపాధ్యక్ష, రెండు కో-ఆప్షన్, నాలుగు సర్పంచ్ స్థానాలకు నేడు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు.

పూతలపట్టులో కుట్రలు

పూతలపట్టు నియోజక వర్గం తవణంపల్లి ఎంపీపీ స్థానాన్ని సైతం దౌర్జన్యంగా కైవసం చేసుకునేందుకు టీడీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారు. ఇక్కడ కూడా టీడీపీకి బలం లేకపోయినా దౌర్జన్యంగా అయినా పీఠాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

సదుంపై సందిగ్ధం

పుంగనూరు నియోజక వర్గం సదుం మండల పరిషత్ అధ్యక్షుడు ఎల్లప్ప మరణంతో ఎంపీపీ ఉపఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలుంటే అన్నింటా వైఎస్సార్‌సీపీ శ్రేణులే ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎంపీటీసీ సభ్యులను రకరకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, భయపెట్టి టీడీపీ వైపు వెళ్లలేదు. ఇప్పటివరకు టీడీపీ వైపు నుంచి ఎవరూ పోటీ చేసే అవకాశం కనిపించలేదు. ఇకపోతే మండల పరిషత్ ఉపాధ్యక్షుల ఉపఎన్నికల్లో రామకుప్పం మినహా, విజయపురం ఉపాధ్యక్ష పదవికి టీడీపీకి బలం లేదు. ఇప్పటివరకు టీడీపీ వైపు నుంచి ఎవరూ పోటీలో లేరు. చేసే అవకాశం కూడా కనిపించలేదు.

తిరుపతి రూరల్ ఎంపీపీ ఉప ఎన్నికపై హైకోర్టు ఫోకస్

తిరుపతి రూరల్ ఎంపీపీ పదవికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. మొత్తం 40 ఎంపీటీసీ స్థానాల్లో 38 వైఎస్సార్‌సీపీ శ్రేణులే గెలుపొందారు. ఒక్కటే ఒక్కటి టీడీపీ దక్కించుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదుగురు ఎంపీటీసీ సభ్యులను భయపెట్టి టీడీపీ వైపు తిప్పుకున్నారు. 32 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉపఎన్నిక సందర్భంగా కూటమి నేతలు చేసిన అరాచకాలను దృష్టిలో ఉంచుకుని, తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికను సజావుగా నిర్వహించేందుకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎంపీటీసీ సభ్యులను సురక్షితంగా మండల పరిషత్ కార్యాలయం వరకు తీసుకొచ్చి తీసుకెళ్లేంత వరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మండల పరిషత్ కార్యాలయంలో, కార్యాలయానికి కిలోమీటరు దూరం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఎంపీపీ ఎన్నిక పోలీసుల భద్రత మధ్య నిర్వహించాలి, ఈ ఎన్నిక నిర్వహణ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు కావాలి. ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించాలని ఆదేశించింది. న్యాయస్థానం ఆదేశాలతో కూటమి నేతలు షాక్‌కు గురయ్యారు.

రామకుప్పంలో ముగ్గురిని మాయం చేసిన పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం పరిధిలోని రామకుప్పం ఎంపీపీ పదవి కోసం అధికార కూటమి నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. బుధవారం ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసుల ద్వారా గుర్తు తెలియని ప్రాంతానికి తరలించారు. రామకుప్పం ఎంపీపీగా ఉన్న మనీంద్రం శాంతకుమారి మృతితో ఎంపీపీ ఎన్నిక అనివార్యం అయ్యింది. మండలంలోని మొత్తం 16 ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచారు. గత ఏడు నెలలో వారిలో ఏడుగురిని టీడీపీ తమ వైపునకు తిప్పుకుంది. ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్‌పై పోక్సో కేసు పెట్టడంతో పరారీలో ఉన్నాడు. తనను అరెస్టు చేయకుండా చూస్తే టీడీపీకి మద్దతు ఇస్తానని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఎలాగైనా ఎంపీపీ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు ప్రలోభాలు, బెదిరింపు దిగారు. అయినా మెజారిటీ ఎంపీటీసీ సభ్యుల మద్దతు సంపాదించలేకపోయారు. దిగజారుడు రాజకీయాలకు తెరతీశారు. గురువారం జరగనున్న ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ తరఫున బీఫాం, విప్ జారీ పత్రాలు అందజేసేందుకు ఎమ్మెల్సీ భరత్ పీఏ మురుగేష్, రామకుప్పం మండలానికి చెందిన సర్పంచులు భాస్కర్‌నాయక్, మోహన్‌నాయక్ బుధవారం రామకుప్పం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లారు. ఆ ముగ్గురిని పోలీసులు అక్కడి నుంచి తమ వాహనంలో తీసుకుపోయారు. ఎందుకు అదుపులోకి తీసుకున్నారో ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. ఎక్కడికి తీసుకెళ్లారో కూడా తెలియదు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన తమ వారు ఎంతకూ తిరిగిరాకపోవడంతో వెతుకుతూ వెళ్లిన మురుగేష్ బంధువు రాము పైనా కూటమి నేతలు దాడికి తెగబడ్డారు. కాగా తన భర్త ప్రాణాలకు పోలీసుల నుంచి ముప్పు పొంచి ఉందని మురుగేష్ భార్య, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షురాలు లలిత ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం, వారిని ఎక్కడ ఉంచారనే సమాచారం కూడా ఇవ్వకపోవడంపై గురువారం హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ చెప్పారు.

వినతి పత్రం లాక్కున్న టీడీపీ నేతలు

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులకు రక్షణ కావాలని ఆ పార్టీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త భరత్ పీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదు కాపీని టీడీపీ నేతలు పోలీసుల నుంచి లాక్కొని పడేశారు. వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు స్వీకరించడానికి వీల్లేదని పోలీసులకు టీడీపీ నేతలు హుకుం జారీ చేసినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎవరూ రామకుప్పం మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కనిపించడానికి వీల్లేదని తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు.

పరిశ్రమలతో కళాశాలలు సమన్వయం



మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: పరిశ్రమలతో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవాకం సంకల్ప పథకంలో భాగంగా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు ప్రైవేటు కళాశాలల్లో చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమష్టిగా మూడేళ్లలో ఎలాంటి అవకాశాలు కల్పించడానికి వీలుగా ఉంటుందనే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగాలు పొందడానికి వీలుగా విద్యార్థుల్లో నైపుణ్యతను సాధించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. అలాగే డీఆర్‌డీఏ, ఏపీఐఐసీ వారు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ టీచర్ల జనరల్ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్లు డీఈఓ వెబ్‌సైట్ లో పొందుపరిచిన జనరల్ సీనియారిటీ జాబితాను సరిచూసుకోవాలన్నారు. ప్రస్తుతం పొందు పరిచిన జనరల్ సీనియారిటీ జాబితాను మార్చి 4వ తేదీ టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆధారంగా రూపొందించినట్లు చెప్పారు. సంబంధిత జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లైతే డీఈఓతో ధ్రువీకరించుకుని ఈనెల 29వ తేదీ లోపు చిత్తూరు డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

28 వరకు వెబ్‌ఆప్షన్ సౌకర్యం

తిరుపతి అర్బన్: డీఎస్సీ ఉచిత శిక్షణకు గతంలో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవడానికి ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉందని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో డీఎస్సీకి చెందిన ఏ కోచింగ్ సెంటర్ అయినా ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. గతంలో 539 మంది ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అందులో ఎస్సీలు 473 మంది, ఎస్టీలు 66 మంది ఉన్నారని చెప్పారు. ఫేస్-1లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గతంలో ఎంచుకున్న కోచింగ్ సెంటర్లు కేటాయింపు ఉంటుందని చెప్పారు. వారికి తాజాగా ఎడిట్ ఆప్షన్ లేదని స్పష్టం చేశారు. ఫేస్-2లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే తాజాగా వెబ్‌ఆప్షన్లు ఈ నెల 28వ తేదీ వరకు పెట్టుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

30న అల్ట్రా స్కానింగ్ రద్దు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో ఈనెల 30వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గర్భిణులకు ఉచితంగా నిర్వహించే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు రద్దు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 6వ తేదీ ఆదివారం నుంచి యథావిధిగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,252 మంది స్వామివారిని దర్శించుకోగా 25,943 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలాఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించబోరని స్పష్టం చేసింది.

'మేం అధికారంలోకి వస్తే విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తాం.' ఇవీ నాటి కూటమి నేతలు మాటలు. విప్లవాత్మకం అంటే ఇదేనేమో మరి.. ఇంటర్ విద్యలో మాతృభాషను ఐచ్ఛికం చేసి.. కనుమరుగు చేసే కుట్రకు పన్నాగమా? అని భాషా పండితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు రూపొందించిన విద్యావిధానాలు ఉపసంహరించుకోవాలి.. లేదంటే మరో భాషా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు. నిరసనలు తెలుపుతున్నారు.



ఇంటర్‌లో తెలుగును ఐచ్ఛికం చేయడంపై గళమెత్తిన తెలుగు పండితులు, అధ్యాపకులు

ఇదేం తెగులు

తెలుగు ఐచ్ఛికం కాదు... ఆత్మగౌరవం కావాలి

- ఇంటర్‌లో తెలుగును తప్పనిసరిగా కొనసాగించాలి
- ఐచ్ఛికం చేస్తే..తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకమే
- మాతృభాష గొంతునులిమే కూటమి ప్రయత్నం దారుణం
- తెలుగుతల్లికి ద్రోహం చేస్తే మరో భాషోద్యమం తప్పదు
- ప్రభుత్వంపై పండితులు, అధ్యాపకులు, భాషాభిమానుల కన్నెర్ర

తిరుపతి సిటీ: మాతృ భాషను మట్టుబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌లో తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం చేస్తూ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఎంబైపీసీ గ్రూప్‌ను ప్రవేశపెట్టి అందులో తెలుగు సబ్జెక్ట్ ఐచ్ఛికం అంటూ విధివిధానాలను రూపొందించడం దారుణం. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్నాం అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం తెలుగు భాషకు ఉరివేసే ప్రయత్నాలు చేస్తోంది. ఇంటర్‌లో తప్పనిసరిగా ద్వితీయ భాషగా తెలుగు సబ్జెక్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో దానిని ఆప్షనల్ సబ్జెక్ట్‌గా మార్పు చేయడంతో తెలుగు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దేశంలో మొట్టమొదటి భాషా సంయుక్త రాష్ట్రంగా ఆవతరించిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచీన హోదా కలిగిన తెలుగు భాషను ఇలా నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నడం తెలుగు జాతి మనుగడకే ప్రమాదం. మాతృ భాషను అవమాన పరిస్తే కన్న తల్లిని అవమానపరచినట్లేనని తక్షణం ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించకోకపోతే ఆంధ్రప్రదేశ్‌లో మరో తెలుగు భాషోద్యమం తప్పదని అధ్యాపకులు, తెలుగు పండితులు, భాషాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరో భాషోద్యమం తప్పదా!

కూటమి ప్రభుత్వంపై అధ్యాపకులు, కవులు, పండితులు, తెలుగుభాషాభిమానులు మండిపడుతున్నారు. తెలుగు సబ్జెక్టును ఇంటర్ విద్యలో ఐచ్ఛికం చేయడంపై కన్నెర్ర చేస్తూ నిరసనలు తెలయజేస్తున్నారు. ప్రస్తుతం స్పాట్ వాల్యుయేషన్‌లో ఉన్న తెలుగు అధ్యాపకులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. అన్ని జిల్లాలో నిరసన జ్వాలలు ఎగసిపడుతున్నాయన్నారు. మరో భాషోద్యమానికి సన్నద్ధం కావాలని తెలుగు భాషాభిమానులు, అధ్యాపకులు పిలుపునిస్తున్నారు.

తెలుగుకు గొడ్డలి పెట్టు



ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోకపోతే మరో భాషోద్యమం ఆంధ్రలో తప్పదు. తల్లి భాషను విద్యార్థులకు అందకుండా కార్పొరేట్ పోకడల బాటలో ప్రభుత్వం నడవడం దారుణం. తెలుగు జాతిని కించపరిచేలా ప్రభుత్వం నడుచుకోవడం సమంజసం కాదు. భాషాభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వం ఇలాంటి ప్రజావ్యతిరేక నిర్ణయం తీసుకోవడం తెలుగు విద్యకు గొడ్డలి పెట్టు. తెలుగు అభిమానులు, విద్యార్థులు, అధ్యాపకులు ఒక్కటై తెలుగు స్వరం వినిపించేందుకు మరో భాషోద్యమం తప్పదు. -వి మునేంద్ర, అధ్యాపకులు, ఎస్వీడబ్ల్యూ కళాశాల, తిరుపతి

విప్లవాత్మక మార్పులంటే మాతృభాషను తొలగించడమా?



విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులంటే ఏవో ఊహించాం. మాతృభాషను తొలగించేందుకు అడుగులు వేయడమే విప్లవాత్మక మార్పులా.. తెలుగు భాషను తొలగించే ప్రయత్నాలు చాపకింద నీరులా జరుగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. తెలుగును ఆప్షనల్‌గా చేసి, మిగిలిన భాషలను ప్రోత్సహిస్తే తెలుగు దానికంతట అదే కనుమరుగు అవుతుందనే కుట్రకోణం దాగి ఉంది. తెలుగు జాతి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. - డాక్టర్ బి సురేష్, అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్యవేడు

జాతి నిర్వీర్య పోతోంది



ప్రభుత్వం ఇంటర్‌లో తెలుగును ఐచ్ఛికం చేయడం చూసి యావత్ తెలుగు జాతి నిర్వీర్యపోతోంది. అమ్మలాంటి తెలుగు భాషకు ఇంతకష్టం వస్తుందని తెలుగు బిడ్డ ఊహించి ఉండరు. తెలుగు సబ్జెక్టును కాదు తెలుగు భాషను కనుమరుగు చేయాలనే ప్రయత్నంలో భాగంగానే ఇలా అడుగులు పడుతున్నాయి. అమ్మ భాషకు ఆటంకాలు ఎదురైతే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. - కిరణ్ కుమార్, అధ్యాపకులు, జూనియర్ కళాశాల, నెరబైలు

ఆంధ్రుల ఆత్మగౌరవం



తెలుగు భాష యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించింది. ఇంటర్‌లో తెలుగును ఐచ్ఛికం చేయడం జీర్ణించుకోలేని విషయం. గ్రామీణ, పట్టణ విద్యార్థుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో వారి భాష పరిరక్షణకు వారు వ్యవహరిస్తున్న తీరు మిగిలి రాష్ట్రాలకు ఆదర్శం కావాలి. ప్రభుత్వం తెలుగును ఐచ్ఛికం చేస్తూ తీసుకున్న నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలి. -ఆర్ లక్ష్మమ్మ, అధ్యాపకురాలు, డెక్కలి, వెంకటగిరి

దేశభాషలందు తెలుగు లెస్స



దేశభాషల్లో తెలుగు లెస్స అన్నారు పెద్దలు. ఈ భాషకు ఉన్నంత క్రేజ్ ఏ భాషకు లేదు. మన దురదృష్టం రాష్ట్రంలో తెలుగు భాషను విస్మరిస్తున్నారు. విద్యారంగంలో ఇంటర్ విద్య కీలకం.అటువంటి దశలో విద్యార్థులకు తెలుగును దూరం చేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నించడం బాధించే అంశం. నోటి మాటలు రావడం లేదు. మాతృభాషను ప్రభుత్వం పరిరక్షించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. -వై శిరీష, అధ్యాపకురాలు, బాలికల జూనియర్ కళాశాల, చంద్రగిరి

అమ్మభాషకు పెనుముప్పు



ఇంటర్‌లో తెలుగును ఐచ్ఛికం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాతృభాషకు పెను ముప్పు. ద్వితీయ భాషగా తప్పనిసరిగా ఉన్న తెలుగును ఆప్షన్ చేయడంలో ప్రభుత్వం ఆంతర్యమేమిటో అర్థంకాలేదు. జిల్లాలో వేల మంది విద్యార్థులకు తెలుగు దూరం కావడమనేది జీర్ణించుకోలేని విషయం. ప్రభుత్వ నిర్ణయం వెనక్కితీసుకోవాలి. లేదంటే తల్లివంటి తెలుగుభాష కనుమరుగు అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. -డాక్టర్ వాణి, అధ్యాపకురాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పుత్తూరు

జనజాతర



గంగమిట్టపై కొలువు తీరిన పోలేరమ్మ



పూలంగి సేవలో ముత్యాలమ్మ

- గంగమిట్టమీద పోలేరమ్మ కొలువు
- ముత్యాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన క్యూలు

చిల్లకూరు: తూర్పుకనుపూరు పోలేరమ్మ జాతరకు బుధవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని జై పోలేరి.. అంటూ పొలికేకలు పెట్టి తమ భక్తిని చాటుకున్నారు. కుమ్మరింట నుంచి బయలుదేరిన పోలేరమ్మ వేకువజామున గంటమిట్టపై కొలువు తీరారు. అమ్మవారి దర్శనం కోసం పలు ప్రాంతాల నుంచి భక్తులు తూర్పుకనుపూరుకు తరలివస్తున్నారు. మరోవైపు ముత్యాలమ్మను దర్శనానికి సైతం భక్తులు పోటెత్తడంతో ఆలయంలోనూ సర్వదర్శనం, ప్రత్యేక క్యూలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు గుడి వెనుక వెయ్యికళ్ల దుత్తలను పగుల కొట్టి, గుడిపై కోడి పిల్లలు, ధాన్యం, ఉల్లిపాయలు వేసి, తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. పోలేరమ్మ గుడి వద్ద మహిళలు తమ మొక్కులను చెల్లించడంలో భాగంగా అమ్మవారి గుడిపై బెల్లం, కుడుములు విసిరి తమ బాధలను తొలగించాలని మొక్కుకున్నారు. కొంత మంది భక్తులు దున్నపోతులను అమ్మవారికి కానుకగా సమర్పించుకున్నారు. పోలేరమ్మ నిలుపు సమయంలో గణాచారి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారిని నిలుపుదల చేశారు. ముత్యాలమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తాగునీరు, అంబలి, మజ్జిగ ప్యాకెట్లను ప్రసాదాలను దాతల సహకారంతో అందజేశారు.

పూలంగి సేవలో ముత్యాలమ్మ

జాతర సందర్భంగా ముత్యాలమ్మను వెండి చీరతో అలంకరించి, పూలంగి సేవను చేశారు. రంగురంగు పూలతో ఆలయం చూపరులను ఆకట్టుకుంది. క్యూల్లో భక్తుల రద్దీ నెలకొంది. దీంతో భక్తులు గంట సమయానికిపైగా క్యూలో వేచి ఉండి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూలతో ఏర్పాటు చేసిన శిలింగం అందరిని ఆకట్టుకుంది.

వైభవం.. యారా గురునాథస్వామి గ్రామోత్సవం

జాతర సందర్భంగా అక్క దేవతలకు ఆద్యుడిగా ఉండే యారా గురునాథస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గంగమిట్టకు దగ్గరలోని సానకాలువ గట్టుపై ఉన్న గురునాథస్వామిని సప్రంపై ఉంచి ఊరేగించారు. గొల్లలు కొరడాల విన్యాసం అందరినీ అలరించింది. అమ్మవారిని బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నాయకుడు తానంకి నానాజీ దర్శించుకున్నారు.



ఆలయం వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.90,600
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,216
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.101,500
రిటైల్ వెండి గ్రాము	రూ.104.50

క్లుప్తంగా

శ్రీవారి సేవలో వశిష్ట



సినిమా డైరెక్టర్ వశిష్ట

తిరుమల: శ్రీవారిని బుధవారం సినిమా డైరెక్టర్ వశిష్ట దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

46 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్లు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే నగరంలో రోడ్డుపై వ్యాపారాలు చేస్తూ ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న 35 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీ ఆదేశాల మేరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నేరాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

విద్యాదానట్రస్టుకు రూ.1.01 కోట్ల విరాళం



డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

తిరుమల: రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజినిదేవి దంపతులు శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111 విరాళంగా అందజేశారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి డీడీని అందజేశారు.

మార్గదర్శనం సుగమం!

తిరుపతి–కాణిపాకం హైర్ సర్వీసులు తిరగాల్సిన మార్గ వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. గత మంగళవారం మార్గ వివాదంతో అద్దె బస్సులు ఆగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు హైర్ బస్సుల యాజమాన్యాలు చర్చలు జరిపాయి. ఒక ఒప్పందానికి వచ్చి సర్దుబాటు చేసుకున్నాయి. దీంతో మార్గదర్శనం కుదిరినట్లు అయ్యింది.

- వెళ్లేటప్పుడు వారధి కిందే..
- వచ్చేటప్పుడు వారధిపైన..
- తిరుపతి–కాణిపాకం హైర్ బస్సులపై క్లారిటీ
- రూట్ వివాదాలకు తెరపడినట్లేనా?
- చర్చలు సఫలం

తిరుపతి అర్బన్: తిరుపతి–కాణిపాకం మార్గంలో నడుస్తున్న హైర్ బస్సుల(ఆర్టీసీ అద్దె బస్సులు) వివాదాలకు తెరపడిందని అంతా భావిస్తున్నారు. కొద్ది రోజులుగా హైర్ బస్సులపై రూట్ వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం(ఈ నెల 25న) అరకొర బస్సులు మినహా మిగిలిన హైర్ బస్సులను కాణిపాకం గ్రామానికి నడపకుండా తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కే పరిమితం చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండు రోజులుగా ఆర్టీసీ అధికారులకు అద్దె బస్సుల యాజమాన్యంతో జరిపిన చర్చలు ఓ కొల్కికి వచ్చాయి. తిరుపతి నుంచి కాణిపాకం గ్రామానికి వెళ్లే సమయంలో బస్టాండ్ నుంచి గరుడవారధి కింద మార్గంలో లీలామహల్, కపిలతీర్థం, అలిపిరి మీదుగా కాణిపాకం గ్రామానికి వెళ్లాల్సి ఉంది. కాణిపాకం నుంచి తిరుపతికి వచ్చే సమయంలో కపిలతీర్థం నుంచి గరుడ వారధిపైన బస్టాండ్‌కు వచ్చేలా నిర్ణయించారు.



తిరుపతి–కాణిపాకం హైర్ బస్సులు

ట్రిప్పులు యథావిధిగా తిరగాల్సిందే

తిరుపతి నుంచి కాణిపాకం గ్రామానికి 14 సర్వీసులు నడుస్తున్నాయి. అందులో 8 సర్వీసులు అద్దె బస్సులు, 6 సర్వీసులు ఆర్టీసీ బస్సులున్నాయి. అద్దె బస్సుల్లో ఒక్కో సర్వీసు రోజూ తిరుపతి– కాణిపాకం మధ్యలో మూడు ట్రిప్పులు తిరగాల్సిందే. మొత్తంగా 8 అద్దె బస్సులు రోజుకు(3 ట్రిప్పులు చొప్పున) 24 ట్రిప్పులు నడపడానికి నిర్ణయించారు.

ప్రయాణికులకే తొలి ప్రాధాన్యత



ఆర్టీసీ ప్రయాణికులకే తొలి ప్రాధాన్యత కల్పిస్తుంది. అద్దె బస్సులు నాలుగేళ్ల అగ్రిమెంట్ ప్రకారం తిరుపతి బస్టాండ్ నుంచి కాణిపాకం గ్రామానికి వెళ్లే సమయంలోనూ వచ్చే సమయంలోనూ గరుడవారధి కింది మార్గంలోనే వెళ్లాల్సి ఉంది. ఒక్కో సర్వీస్ రోజుకు 3 ట్రిప్పులు తిప్పాలని నిర్ణయించాం. అయితే డ్రైవర్లు కొన్ని ఇబ్బందులు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తిరుపతి నుంచి కాణిపాకం వెళ్లే సమయంలో గరుడ వారధి కింది మార్గంలోను, వచ్చే సమయంలో మాత్రమే వారధిపై మార్గంలో నడపడానికి అంగీకరించాం. దీంతో హైర్ బస్సుల సమస్య పరిష్కారించాం. భక్తుల సౌకర్యం కోసమే వెళ్లే సమయంలో వారధి కింది భాగంలో వెళ్లాలని స్పష్టం చేశాం. – బాలాజీ, డిపో మేనేజర్, తిరుపతి బస్టాండ్

చక్కెర ఫ్యాక్టరీల ఆధునీకరణ, విస్తరణపై చర్యలేంటి?

- పార్లమెంట్‌లో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : పార్లమెంట్ పరిధిలోని చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ, చెరుకుసాగు అభివృద్ధికి మద్దతు ధరపై ప్రభుత్వ విధానాలు, పథకాల అమలుపై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణపై బుధవారం పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. చెరుకు పంట మెరుగైన ఉత్పత్తి, నిర్వహణ సులభతరం చేయడానికి జాతీయ చక్కెర సంస్థ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో పరిశోధనలను నిర్వహించడానికి ప్రత్యేక పరిశోధనా సంస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. చక్కెర కర్మాగారాల ఆధునీకరణ, విస్తరణ, దేశవ్యాప్తంగా చక్కెర పరిశ్రమ అభివృద్ధికి షుగర్ డెవలప్‌మెంట్ ఫండ్ యాక్ట్ 1982 ద్వారా మద్దతు ఇచ్చినా, ఈ లోన్ స్కీమ్‌ను 2021లో నిలిపేశారని, కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దేశంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు 2018–2022 మధ్య కేంద్ర ప్రభుత్వం పలు వడ్డీ రాయితీ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు.

చక్కెర మిల్లులకు కొత్త డిస్టిలరీల ఏర్పాటు, ఉన్న డిస్టిలరీల విస్తరణ, దేశవ్యాప్తంగా ఉన్న మొలాసిస్ ఆధారిత డిస్టిలరీలను డ్యుయల్ ఫీడ్ డిస్టిలరీలుగా మార్చడం కోసం 2025 మార్చి 6వ తేదీన కొత్త పథకం ప్రకటించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కో–ఆపరేటివ్ షుగర్ మిల్స్ తమ షుగర్‌కేన్ ఆధారిత ఇథనాల్ ప్లాంట్లను మల్టీ–ఫీడ్ ప్లాంట్లుగా మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చెరుకు పంటపై పరిశోధన కోసం ప్రత్యేక శాస్త్ర పరిశోధన సంస్థల ఏర్పాటు గురించి వివరిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మూడు చక్కెర పరిశోధనా కేంద్రాలున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లిలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృష్ణా జిల్లా, వుయ్యూరులో చక్కెర పరిశోధనా కేంద్రం, తిరుపతి జిల్లా పెరుమాళ్లపల్లిలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం, నూతన చెరుకు విత్తన రకాలను అభివృద్ధి చేసి రైతులకు అందించేందుకు పని చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 2003వి46, 93వి97, సీఓటీ8201, సీడీప 14321, 2006ఎ223 వంటి ముఖ్యమైన చెరుకు విత్తన రకాలను విడుదల చేశారన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

అన్నమయ్యకు తిరుమంజనం




అన్నమాచార్య కళామందిరంలో సంకీర్తన గోష్ఠిగానం చేస్తున్న ప్రాజెక్టు కళాకారులు, హరికథ గానం చేస్తున్న జయంతి

తిరుమల: తాళ్లపాక అన్నమాచార్యులు 552వ వర్ధంతి తిరుమలలో ఆయన వంశీకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని అన్నమాచార్యుల విగ్రహానికి తిరుమంజనం చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవ అన్నమాచార్యులు, భరద్వాజ్, హైగ్రీవ, నారాయణ చార్యులు, కంచి రాజేష్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

అన్నమయ్య వర్ధంతి మహోత్సవాలు ప్రారంభం

తిరుపతి కల్చరల్: టీటీడీ, హిందూ ధార్మిక ప్రాజెక్టుల అన్నమాచార్య కళామందిరంలో అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం అలరింపజేసింది. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి దినం, ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం హారతి మహానివేదన చేపట్టారు. తరువాత చెన్నైకి చెందిన డాక్టర్ తాళ్లపాక మీనలోచని బృందం అన్నమయ్య సంకీర్తలను రాగయుక్తంగా గానం చేశారు. తర్వాత తిరుపతికి చెందిన జయంతి ,సావిత్రి బృందం ఆలపించిన ×అన్నమయ్య జీవిత చరిత్ర× హరికథాగానం సభికులను ఆకట్టుకుంది. సాయంత్రం అనూష, ఆర్తి బృందం ప్రదర్శించిన సంగీత కచేరి, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకుడు వెంకటేశ్వర్లు భాగవతార్ బృందం హరికథా గానం రసరమ్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు రాజగోపాలరావు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం



ఎర్రచందనం దుంగలు చూపుతున్న తిరుపతి అటవీశాఖ అధికారులు

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్న వాహనం సహా దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి వివేక్, సబ్ డీఎఫ్‌వో నాగభూషణం ఆదేశాల మేరకు బుధవారం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, కృష్ణాపురం సెక్షన్ సిబ్బంది, పీల్డ్ వాచర్లు పంగూరు హైవే వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు డస్టర్ రేనాల్డ్ కారు అధిక వేగంతో వస్తుండడాన్ని వారు గమనించి, ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా ఏర్పేడు వైపు దూసుకెళ్లింది. దీంతో వారు వాహనాన్ని వెంబడించగా టీఎన్–31–ఎజె 7299 డస్టర్ కారును స్మగ్లర్లు తుగ్గపేరి–నచ్చినేరి గ్రామాల వద్ద వదిలిపెట్టి పారిపోయారు. అటవీ అధికారులు ఆ వాహనాన్ని పరిశీలించగా అందులో చెక్కిన 296కిలోల బరువు పది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి, వాహనం సహా స్వాధీనం చేసుకున్నారు. కారు సహా వాటి విలువ రూ. 5 లక్షలు విలువ ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ దాడుల్లో కృష్ణాపురం డీఆర్వో సికిందర్, ఎఫ్‌బీఓలు పురుషోత్తం, శోభారాణి, సిబ్బంది పొన్నయ్య, జితేంద్ర, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తిరుమలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలా?

– తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుమలలోని పాపవినాశనంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతుండడంతోనే బోటింగ్ ట్రయిల్ రన్ చేశామని జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ ప్రకటించడంతో కూటమి పాలనలో తిరుమలలో అసలేం జరుగుతుందోనని లోకానికి చాటి చెప్పినట్లైందని ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. తిరుమలలో పాపవినాశనం డ్యామ్‌కు ఎంతో ప్రత్యేకత, పవిత్రత ఉందన్నారు. పాపాలను హరించేది కావడంతో ఆ డ్యామ్‌కు ఆ పేరు రావడంతోపాటు భక్తులు తాగడానికి ఆ నీటిని వినియోగిస్తారన్నారు. అలాంటి డ్యామ్‌లో బోటింగ్ ట్రయిల్ రన్ చేపట్టడడంపై అధికారులు ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతూ, మొత్తానికి తిరుమల పవిత్రను నాశనం చేయాలనే భావన కలిగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో తిరుమలలో అపచారాలు జరిగిపోయాయని కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దుష్ప్రచారం చేశారన్నారు. అయితే సనాతన ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని గొప్పలు చెప్పుకునే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, అటవీ అధికారి వివేక్ ప్రకటనపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.

వేలం పాటల్లో స్వామిభక్తి

- వేలం పాటలు ఆపివేయాలని ఆదేశించిన టీడీపీ సీనియర్ నేత
- వెంటనే వేలం పాట రద్దు.. ఆపై వాయిదా ప్రకటన
- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తీరుపై మండిపడుతున్న స్థానికులు

చంద్రగిరి: పట్టణంలోని సంత వేలం పాటల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వామిభక్తి చాటుకున్నాడు. రూ.లక్షల పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటిస్తూ వేలం పాటను రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. చంద్రగిరి పంచాయతీకి ఆదాయ వనరులైన వారపు సంత, బస్టాండ్, కసాయి మార్కెట్‌కు బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ ముదికుప్పం రూపరామ్మూర్తి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు తొలుత వారపు సంత వేలం పాటను ప్రారంభించారు. ఏడాదికి సర్కారు వారి పాట రూ.24 లక్షలుగా నిర్ణయించారు. కాంట్రాక్టర్ గురవారెడ్డి వర్గం రూ.24 లక్షల సర్కారు వారి పాట పెడితే ఎలా అంటూ ప్రశ్నించారు. ఆపై అధికారులు వేలం పాటను ప్రారంభించగానే మరో కాంట్రాక్టర్ మనోహర్ వేలం పాటలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో గురవారెడ్డి, మనోహర్‌తో వాగ్వివాదానికి దిగాడు. వేలం పాటను ఎలా పాడుతావంటూ ఆయనపై దౌర్జన్యానికి యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం నిర్వహించిన వేలం పాట పోటాపోటీగా సాగుతూ రూ.28.09 లక్షలు దాటింది. ఈ క్రమంలో అధికార పార్టీకి చెందిన సీనియర్ నేత రమేష్‌రెడ్డి వేలం పాటలో కలుగజేసుకుని వెంటనే వేలం పాటను రద్దు చేయాలంటూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓను ఆదేశించారు. పౌరుషాలకు పోయి పోటాపోటీగా వేలం పాట పాడుతున్నారని, వెంటనే వేలం పాటను రద్దు చేయాలని ఆదేశించారు. ఇరువర్గాల వారు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఇద్దరితో మాట్లాడతామన్నారు. వెంటనే మైకు అందుకున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం వారపు సంతతోపాటు కసాయి మార్కెట్, బస్టాండ్ వేలం పాటలు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. గుత్తేదారులు ఇద్దరూ వేలం పాటలో పాల్గొన్నప్పటికీ వేలం పాటను రద్దు చేయడం పంచాయతీ ఆదాయానికి గండికొట్టడమే అని మండిపడ్డారు. పంచాయతీకి సమకూరే ఆదాయానికి అధికారులు గండికొట్టారంటూ స్థానికులు మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా వేలం పాటను రద్దు చేయడం దారుణమని, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పూర్తిగా టీడీపీ కార్యకర్తల వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు.



వేలం పాటలో పాల్గొన్న మనోహర్‌తో వాగ్వివాదానికి దిగిన గురవారెడ్డి

సీనియారిటీ జాబితా..తప్పులతడక

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖ విడుదల చేసిన సీనియారిటీ జాబితా తప్పుల తడకగా ఉందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, జగన్నాథం ఆరోపించారు. తిరుపతిలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం నిర్వహించిన ముఖ్య ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాశాఖ ఇప్పటికే పదుల సంఖ్యలో ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించినప్పటికీ తిరిగి తప్పులతో జాబితాలు విడుదల చేసిందని ఆరోపించారు. జాబితాలోని తప్పుల సవరణకు గతంలోనే చిత్తూరు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వివరాలు తీసుకున్నప్పటికీ తిరిగి అవే తప్పులు పునరావృతం కావడం బాధాకరమన్నారు. సవరణలకు తిరుపతి, చిత్తూరుతో పాటు డివిజన్ కేంద్రాల్లో సవరణ దరఖాస్తులను డీవైఈఓ, ఎంఈఓలతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ డివిజన్ కన్వీనర్ సి.వాసు, రాష్ట్ర కౌన్సిలర్ రామాంజనేయులు, తిరుపతి అర్బన్ అధ్యక్షులు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనే కర్తవ్యం కావాలి



హాస్టల్ వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థి దశ కీలకమైందని, లక్ష్య సాధనే కర్తవ్యంగా శ్రమించాలని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృతవర్సిటీలో బుధవారం జరిగిన హాస్టల్ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని శ్రమిస్తే విజయం తప్పక వరిస్తుందన్నారు. విద్యార్థులు భావిభారత సమాజానికి నిర్మాతలుగా రాణించాలని సూచించారు. ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా హాస్టల్ వసతి, క్రీడావసతి, శారీరక–మానసిక వికాసానికి సంబంధించిన విశేష కార్యక్రమాలు వర్సిటీలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, చీఫ్ వార్డెన్లు ప్రొఫెసర్ వెంకట్రావు, పరిమిత పండ, వార్డెన్లు జ్యోతి, లీనాచంద్ర, బుల్టీదాస్, ప్రదీప్ కుమార్ బాగ్, సోమనాథ్ దాస్, జ్ఞాన రంజన పండ, లక్ష్మీనారాయణ, ఉదయన హెగ్డే, ఆలోక్ మండల్, హాస్టల్ మేనేజర్ ఫణివర్మ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అధికార దుర్వినియోగం

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విచ్చలవిడిగా అధికార దుర్వినియోగం జరుగుతుందని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వాఖ్యానించారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో అధికారులు కేవలం మూడున్నరేళ్ల మాత్రమే ఉండేటట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పేద ప్రజలకు న్యాయం చేయడం విస్మరించి కేవలం కూటమి నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర అధికారుల తీరుపై హైకోర్టు సైతం కన్నెర చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు తప్పు చేసిన ఏ ఒక్క అధికారినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇక డక్కిలి సర్పంచ్ వేమక్కకు సమాచారం ఇవ్వకుండా సభలు, పనులు నిర్వహించడంపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సమగ్ర నివేదికను అందించాలని గూడూరు డీఎల్‌పీఓకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా డక్కిలికి విచారణకు వచ్చిన అధికారి ఇద్దరు కూటమి నేతలను పక్కన పెట్టుకుని వేమక్కను విచారించారన్నారు. చదువురాని ఎస్టీ సర్పంచ్ వేమక్కపై స్థానిక అధికారులు వ్యవహార శైలిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.



వేమక్కను విచారిస్తున్న డీఎల్‌డీఓ వీడియోను చూపుతున్న నేదురుమల్లి

కత్తిపీటతో గొంతు కోసుకుని వ్యక్తి మృతి



ప్రసాద్ మృతదేహం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రజక కాలనీలో నివాసం ఉంటున్న ప్రసాద్(40) అనే వ్యక్తి మానసికస్థితి సరిగాలేక మద్యం మత్తులో కత్తితో గొంతు కోసుకుని మృతి ఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రజకకాలనీలో ప్రసాద్ అనే వ్యక్తి రెండేళ్లుగా ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కూలి పనులకు వెళుతూ వచ్చిన డబ్బులతో అతిగా మద్యం సేవించేవాడు. ఇతనికి మతిస్థిమితం సరిగా లేక పోవడంతో మద్యం మత్తులో సైకోలా ప్రవర్తిస్తూ స్థానికులకు సైతం భయాందోళలను గురి చేసే వాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ప్రసాద్ మద్యం మత్తులో ఇంట్లో ఉన్న కత్తిపీట తీసుకుని గొంతు కోసుకున్నాడు. స్థానికులు గుర్తించి అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీఆర్వో రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ ఉద్యోగి సతీమణి ఆత్మహత్య

సూళ్లూరుపేట: పట్టణంలోని డీఆర్‌డీఎల్ కాలనీలో షార్ ఉద్యోగి సతీమణి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సూళ్లూరుపేట డీఆర్‌డీఎల్ కాలనీలో షార్ ఉద్యోగి మురళీకృష్ణ, అతని భార్య సతీమణి రాధిక (31) నివాసం ఉంటున్నారు. రాధికకు కొంతకాలంగా మానసికంగా పరిస్థితి బాగాలేక పోవడంతో పాటు, మెడపై రెండు గడ్డలు రావడంతో పరీక్షలు చేయించారు. ఇందులో ఒక గడ్డకు సంబంధించి వచ్చిన రిపోర్టుతో టీబీ అని డాక్టర్లు నిర్ధారించారు. మరోగడ్డకు సంబంధించి బయాప్సీ టెస్ట్‌కు పంపించారని, అది ఇంకా రాలేదు. దీంతో ఆమె పిల్లలను ఊరికి పంపించేశారు. దీంతో మనస్తాపం చెంది, భర్త ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని, మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బ్రహ్మానాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ రాష్ట్ర విభాగ కమిటీలు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాకు చెందిన రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల ఎంపిక చేశారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వయ్యాల కృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎం.పిచ్చిరెడ్డి, ఎం.నరసింహారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సి.మునికృష్ణ, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి చెంగయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సి.కాలప్ప, నల్లానిబాబు, కార్యదర్శులుగా గురునాథం ఉగ్గుమూడి, సుగుణప్ప, పి.శ్యామల్, సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌సుందర్‌రాజ్ నియమితులయ్యారు. అలాగే వీవర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.తిలక్‌బాబు, వీవర్స్ వింగ్ కార్యదర్శిగా పులి రామచంద్రయ్య, వలంటీర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేగు ప్రశాంత్ గుప్త, కార్యదర్శులుగా ఉదయగిరి రమేష్, ఎం.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.హరినాథరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విజయసింహారెడ్డి

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాదిరెడ్డి విజయసింహారెడ్డిని ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఆందోళనబాట

తిరుపతి రూరల్: మండలంలోని గాంధీపురం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు జీతాల కోసం రోడ్డెక్కారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో పారిశుద్ధ్య కార్మికులు మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు అందరికీ మొరపెట్టుకున్నారు. అయినా సరే వారెవరు కనికరించకపోవడంతో బుధవారం గ్రామ సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు వెంకటరామయ్య, నాగభూషణం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేసి, పంచాయతీ సిబ్బందిగా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత 13 నెలలుగా చెల్లించాల్సిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. గాంధీపురం పంచాయతీలో జీతాలు ఇచ్చేందుకు అవసరమైన నిధులున్నా అధికారులు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో పనిచేసిన వారిని తొలగించి, ఆ స్థానంలో తమ పార్టీకి చెందిన వారిని విధుల్లో చేర్చుకోవాలని పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి తీసుకురావడం, అందుకు పంచాయతీ సర్పంచ్ శివలక్ష్మి అంగీకరించక పోవడంతో పంచాయతీ కార్యదర్శి ఎవరికీ జీతాలు ఇవ్వకుండా నిలిపివేసినట్టు వారు ఆరోపించారు. నెలంతా పనిచేసిన వారికి జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాంధీపురంలో జీతాల కోసం ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు